

ఉపాధి హామీలో కొత్త పనులు గుర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీలో కొత్త పనులు గుర్తించి అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించి మాట్లాడారు. ప్రతి మండలంలోనూ రోజుకు 1200 నుంచి 1500 మంది కూలీలకు పని కల్పించాలని అధికారులకు సూచించారు. పనికి వచ్చిన కూలీలందరికీ ఎన్‌ఎంఎంఎస్ ద్వారా హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో అమృత్ సరోవర్ కింది గుర్తించిన 80 చెరువుల పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆదేశించారు. కూలీలందరికీ చట్ట ప్రకారం మూడు రోజుల్లోగా వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామాలలో ప్రత్యేక ఆధార్ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఆధార్ కేంద్రాల్లో ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయడంతో పాటు 5 సంవత్సరాలలోపు పిల్లలకు కొత్త ఆధార్ నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిసిహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా.. రాచరికమా..!

అంగన్‌వాడీలపై ప్రభుత్వ దమనకాండ

చలో విజయవాడకు వెళ్లనీయకుండా తీవ్ర నిర్బంధం, అరెస్టులు

కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలింపు

నిరసనలతో హోరెత్తిన పోలీసు స్టేషన్లు

ఏలూరులోని కల్యాణ మండపంలో గేట్లు వేసి నిర్బంధకాండ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంగన్వాడీలపై ప్రభుత్వం సాగించిన నిర్బంధకాండ చూసి మనం ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా.. లేక రాచరిక పాలనలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి వెళున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉంది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుంది. ప్రజల హక్కులను కాలరాస్తూ వైసిపి ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో ముందుకు సాగుతోంది. వాహనాల్లో వెళ్తున్న వివిధ జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను ఏలూరు కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డగించిన పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. తూర్పుగోదావరి, విశాఖతోపాటు జిల్లాలోని పలు మండలాలకు చెందిన అంగన్‌వాడీలను విజయవాడ వెళ్లకుండా అడ్డుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకూ టిఫిన్, తాగునీరు లేక, పోలీస్‌స్టేషన్ల వద్ద మరుగుదొడ్లు వంటివి లేక అంగన్‌వాడీలు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతం. జిల్లాతోపాటు వివిధ జిల్లాలకు చెందిన అంగన్‌వాడీలను కలపర్రు టోల్‌గేట్ వద్ద అడ్డుకుని పెదపాడు, ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరిన సిఐటియు నాయకులు అంగన్‌వాడీలతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనలు చేపట్టారు. దీంతో ఏలూరు వన్‌టౌన్ పెరుగుచెట్టు సమీపంలోని శ్రీ సీతారామ భర్తియా కల్యాణ మండపంలో దాదాపు 150 మంది అంగన్‌వాడీలను నిర్బంధించి గేట్లు మూసివేశారు. దీంతో నిర్బంధించిన అంగన్‌వాడీలను విడుదల చేయాలని సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, బి.సోమయ్యతోపాటు పలువురు నాయకులు అక్కడకు చేరుకుని రోడ్డుపై పడుకుని నిరసన చేపట్టారు. సిఎం డౌన్‌డౌన్ అంటూ అంగన్‌వాడీలు చేసిన నినాదాలు హోరెత్తాయి. సచివాలయ మహిళా పోలీసులను రంగంలోకి దించి అంగన్‌వాడీలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించిన పరిస్థితి ఉంది. జంగారెడ్డిగూడెం, చింతలపూడి, పెదపాడు, నూజివీడు, ఉంగుటూరు, భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీలపై తీవ్ర నిర్బంధకాండ సాగింది. తాము అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తామని చెప్పిన వైసిపి నాలుగేళ్లయినా ఆ ఊసే మరిచిపోయింది. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ అందించాలని, ఫేస్‌యాప్ రద్దు చేయాలని, జీతాలు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్లతో చలో విజయవాడకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. గతంలో టిడిపి ప్రభుత్వ హాయాంలోనూ ఇదేవిధంగా అంగన్‌వాడీలను ఇబ్బంది పెట్టిన పరిస్థితి ఉంది. అదే టిడిపి పతనానికి కారణమైంది. ఇప్పుడు వైసిపి సైతం అదేబాటలో పయనిస్తోంది. తమ హక్కులపై గళం విప్పుతున్న ఉద్యోగులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది.


భీమవరంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


పాలకొల్లులో జలమయమైన రోడ్డు

జిల్లాలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

అల్పద్రోణి ప్రభావంతో వరుసగా మూడో రోజు సోమవారం తెల్లవారుజాము నుంచి నియోజకవర్గంలో భారీ వర్షం పడింది. దీంతో జనజీవనం స్తంభించింది. రోజువారీ పనులు చేసుకునేందుకు ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని రోడ్లు, డ్రెయిన్లు ఏకమై జలాశయాలుగా మారాయి. ఇంటర్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు : మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పలు రహదారులపై నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మొగల్తూరులోని పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు రహదారులపై నిలిచిపోయింది. ప్రజలు అంటువ్యాధులు ప్రబలతాయని ఆందోళన చెందుతున్నారు.

పెనుమంట్ర : అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం 6 గంట సమయంలో కొద్దిపాటి వర్షం పడింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పొలమూరు, మాముడూరు, పెనుమంట్ర, గరువు, మార్టేరు, ఆలమూరులో పడింది.

పాలకొల్లు రూరల్: సోమవారం ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత నుండి వాతావరణం అనుకూలించడంతో ఊపిరి పీల్చుకున్నారు.


తణుకు పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న నేతలు, అంగన్‌వాడీలు


ఆకివీడులో పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు


వీరవాసరంలో బైఠాయించిన అంగన్‌వాడీలు

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

స్పందనలో అందిన ప్రతి దరఖాస్తునూ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి 321 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో అందిన వినతుల పరిష్కారం అర్జీదారులకు ఆనందం కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతిరోజూ స్పందనపై పది నిమిషాలు సమయం కేటాయించినట్లయితే ఎప్పుడు సమస్యలు అప్పుడే పరిష్కారం అవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్బంధం..

జిల్లా వ్యాప్తంగా సిఐటియు నేతలు, అంగన్వాడీల అరెస్టులు

600 మందికి నోటీసులు

పలుచోట్ల పోలీస్ స్టేషన్ల ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం మరోసారి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. పోలీసులను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపునకు ఒడిగట్టింది. మహిళలని చూడకుండా ఉక్కుపాదం మోపింది. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన చలో విజయవాడ మహాధర్నాకు అడుగడుగునా ఆంక్షలు విధించింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ సిఐటియు నేతలు, అంగన్‌వాడీలు 600 మందిని అరెస్ట్‌చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు మిన్నంటాయి. పోలీస్‌స్టేషన్ల ఎదుట ప్రత్యక్షంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. భీమవరంలో రహదారిపై బైఠాయింపును పోలీసులు అడ్డుకుని వాగ్విదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఉద్యమాలపై నిర్బంధాలు విధించడం దారుణమని సిఐటియు ఖండించింది.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చలో విజయవాడ మహాధర్నకు పిలుపునిచ్చింది. అయితే ప్రభుత్వం అంగన్వాడీలను విజయవాడ వెళ్లనీకుండా అడ్డుకుంది. పోలీసులను ఉపయోగించి అడుగడుగునా నిర్బంధాన్ని విధించింది. సిఐటియు నేతలకు, అంగన్‌వాడీలకు ముందస్తు నోటీసులు జారీ చేయడంతో పాటు తెల్లవారుజాము నుంచే గృహ నిర్బంధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 600 మందిని ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, కాళ్ల, వీరవాసరం, పాలకొల్లు, మొగల్తూరు, గణపవరం, ఆకివీడు, పెనుగొండ, పెనుమంట్రతోపాటు అన్ని ప్రాంతాల్లో సిఐటియు నేతలు, అంగన్వాడీలను ఎక్కడికక్కడ ఆంక్షలు పెట్టి నిర్బంధించారు.

మిన్నంటిన ఆందోళనలు..

ఎక్కడికక్కడ నిర్బంధంపై జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. ఆయా పోలీస్ స్టేషన్ల వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ముఖ్యంగా తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఆకివీడు వంటి ప్రధాన ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు.

రహదారిపై బైఠాయింపును అడ్డుకున్న పోలీసులు

విజయవాడ వెళ్లనీకుండా ప్రభుత్వం విధించిన నిర్బంధాన్ని నిరసిస్తూ భీమవరం ప్రకాశంచౌక్‌లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో రహదారిపై బైఠాయిస్తున్న నేపథ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అంగన్వాడీలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరిగింది. అయితే అంగన్‌వాడీలంతా ఒక్కసారిగా రహదారిపై బైఠాయించడంతో పోలీసులు వారిని పైకి లేపే ప్రయత్నం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు జులుం నశించాలని, దౌర్జన్యాలు అరికట్టాలని నినాదాలు చేశారు.

నిర్బంధాన్ని ఖండించిన సిఐటియు

విజయవాడ మహాధర్నాను అడ్డుకుని అంగన్‌వాడీలపై ప్రభుత్వం విధించిన నిర్బంధాన్ని అక్రమ అరెస్టులను సిఐటియు ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని విమర్శించారు. ఉద్యమాలను ఆపే ప్రభుత్వాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని, ఈ విషయాన్ని వైసిపి ప్రభుత్వం గుర్తుంచుకోవాలని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


భీమవరంలో అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు


పాలకొల్లులో పోలీసుల అదుపులో అంగన్‌వాడీలు

ఆకివీడు : అంగన్‌వాడీలు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ఆకివీడు పోలీసులు కొంతమేర భగ్నం చేశారు. సోమవారం ఉదయం 8:30లకు విజయవాడ వెళ్లేందుకు ఆకువీడు మండలానికి చెందిన అంగన్‌వాడీలే కాకుండా జిల్లా సరిహద్దులోని ఏలూరు జిల్లా కైకలూరు, కలిదిండి మండలాలు, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల, ఉండి మండలాలకు చెందిన సుమారు 300 మంది ఆకివీడు రైల్వే స్టేషన్ చేరారు. అక్కడికి పోలీసులు చేరుకుని మోహరించినా సుమారు పాతిక మందిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు ఎక్కడికక్కడ రైలు ఎక్కేశారు. వారిని మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. తరువాత విడుదల చేశారు. సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి.అప్పారావు, కె.తవిటి నాయుడుకు నోటీసులిచ్చి వారిని గృహ నిర్బంధం చేశారు. మధ్యాహ్నం వారిని విడుదల చేశారు. తరువాత తవిటి నాయుడు, అప్పారావు పోలీస్ స్టేషన్ చేరుకుని అంగన్‌వాడీలతో నిరసన తెలిపారు.

మొగల్తూరు : చలో విజయవాడ కార్యక్రమంలో అలంకార్ సెంటర్లో జరిగే ధర్నాకు అంగన్వాడీలు సోమవారం మండలంలోని గ్రామాల నుండి నరసాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ వారిని పోలీసులు నిలుపుదల చేశారు. కాళీపట్నంలోని జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీల యూనియన్ అధ్యక్షురాలు మేడిది స్వర్ణలత మాట్లాడారు.

వీరవాసరం : అంగనవాడీలపై పోలీసుల నిర్బంధాన్ని నిరసిస్తూ వీరవాసరం బస్టాండ్ వద్ద సోమవారం అంగన్‌వాడీలు జాతీయ రహదారి పై బైఠాయించారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి ప్రభుత్వమే నిర్బంధాలు విధించి మొండిగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, శ్యాంబాబు, రెడ్డి రామారావు, లక్ష్మీపార్వతి, ఎస్తేరు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను తణుకు పట్టణ పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయకుమారి పోలీస్ స్టేషన్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. విజయవాడ ధర్నాకు వెళ్తుంటే మహిళలను అరెస్టు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చి నాలుగేళ్లయినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని, పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చలో విజయవాడ వెళ్తుతున్న వారిని ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.వి.ప్రతాప్, కేతా గోపాలన్ తెలిపారు. పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల వద్ద అరెస్టులు చేసిన వారిని ప్రతాప్, గోపాలన్, అజయ కుమారి పరామర్శించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ జిఒ 1ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

ఉండి : చలో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తు నోటీసులు అందించడం దారుణమని అంగన్‌వాడీలు చైతన్య, కుసుమ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

ఆచంట:పోలీసులు నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని సిఐటియు మండల కార్యదర్శ వద్దిపర్తి అంజిబాబు అన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరుతున్న అంగన్‌వాడీ వర్కర్లకు, సిఐటియు నాయకులను నోటీసులిచ్చి పోలీస్‌స్టేషన్లో సుమారు రెండు గంటల పాటు నిర్బంధించి అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారి ఇళ్ల వద్దకు వెళ్లి అర్ధరాత్రి వేళ నోటీసులిచ్చి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు.

పెనుమంట్ర : అంగన్‌వాడీల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న నేతలను సోమవారం పోలీసులు నిర్బంధించారు. ధర్నాకు వెళ్లేందుకు ఎటువంటి అనుమతులూ లేవని బ్రాహ్మణచెరువులోని సిఐటియు మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజుకు ఇంటి వద్ద పోలీసులు నోటీస్ ఇచ్చారు.

పాలకొల్లు : పాలకొల్లు, పోడూరు మండలాలకు చెందిన 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను విజయవాడ వెళ్లకుండా సోమవారం పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పోడూరు ప్రోజెక్ట్ ప్రధాన కార్యదర్శి పితల రాజమణి ఆధ్వర్యంలో సిఐ రాంబాబు వారిని విడుదల చేయించారు.

కాళ్ల : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడకు బయలుదేరుతున్న వర్కర్లను, సిఐటియు నాయకులను సోమవారం తెల్లవారుజామున కాళ్ల పోలీసులు హౌస్ అరెస్టు చేయడం అన్యాయమని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ విమర్శించారు. సోమవారం తెల్లవారుజామున సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణకు, అంగన్‌వాడీ నాయకురాలు దావులూరి మార్తమ్మ, అంగన్‌వాడీలకు ఎస్ఐ మూర్తి, పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టులు దారుణం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి - భీమవరం

కనీస వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనను అడ్డుకుంటూ అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, నాయకులను గృహ నిర్బంధం చేయడం, విజయవాడకు చేరుకున్న అంగన్‌వాడీలను రైల్వేస్టేషన్ల, ఇతర చోట్ల అటకాయించి 500 మందిని అరెస్టులు చేయడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వ విధానాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి వారిపై దౌర్జన్యంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. వారి సమస్యలు పరిష్కరించాలని, అరెస్టు చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ వేశారు

అసెంబ్లీలో దాడికి టిడిపి నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు


రాస్తారోకో చేస్తున్న టిడిపి శ్రేణులు

అసెంబ్లీ సాక్షిగా ప్రజాప్రతినిధులపై దాడి చేయించి ముఖ్యమంత్రి ఆనందం పొందుతున్నారని టిడిపి నాయకుడు, విజయవాడ ఎంపీ కేశినేని నాని సోదరుడు కేశినేని శివనాద్ (చిన్ని) అన్నారు. అసెంబ్లీలో టిడిపి ఎంఎల్‌ఎలపై దాడిచేయడాన్ని ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం కొద్దిసేపు రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడారు. ముఖ్యమంత్రి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, కార్యదర్శి నవకోట్ల రామారావు, పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు, కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్మీడియట్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించి, మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. సోమవారం నరసాపురం పురపాలక సంఘం పరిధిలో వైఎన్, ఆదిత్య కాలేజీల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టరు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షల నిర్వహణను సీసీ టీవీల్లో పర్యవేక్షించారు. వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులకు కలెక్టరు సూచనలు చేశారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష ప్రారంభం నుండి చివర వరకూ అధికారులు, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టరు ప్రశాంతి ఆదేశించారు. ఆమె వెంట ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.

టెండర్ విధానం ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

టెండర్ విధానాన్ని ఆపాలని, పాత పద్ధతినే కొనసాగించాలని ఎపి సీడ్స్ హమాలీస్, మహిళా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎపి సీడ్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో టెండర్ విధానాన్ని నిరసిస్తూ నాలుగో రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎపి సీడ్స్‌లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, ఎక్కడా లేని విధంగా తణుకు యూనిట్‌లో టెండర్ విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. కార్మికుల పొట్ట కొట్టే టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే అగ్రిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.త్రిమూర్తులు, కె.వరలక్ష్మి, జి.రూతమ్మ, వెంకటరమణ, సాంబశివరావు, శ్రీహరి పాల్గొన్నారు.

కాటికాపరుల పట్ల పోలీసుల తీరు అమానవీయం

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడలో కాటికాపరుల పట్ల పోలీసుల తీరు అమానవీయమని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతి బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కెవిపిఎస్ అనుబంధ సంఘమైన కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం (కెజిబిఎస్) కాటికాపరుల సమస్యలపై చలో విజయవాడకు పిలుపునిచ్చారని తెలిపారు. దీనిలో బాగంగా విజయవాడ చేరుకున్న కాటికాపరులు, బెగరుల పట్ల ప్రభుత్వం పోలీసులతో వ్యవహరించిన తీరు అమానవీయమని తెలిపారు. రైల్వే స్టేషన్ బయటకు వచ్చిన కాటికాపరులను అడ్డుకొని అవమానించే విధంగా బహిరంగంగా రోడ్డుపై కూర్చోబెట్టడం దారుణమని విమర్శించారు. కాటికాపరి వృత్తిదారులను 4వ తరగతి ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. వారికి కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వాలని పేర్కొన్నారు. వారు చేసే వృత్తి ఆధారంగా 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని తెలిపారు.

డ్రోన్ సర్వేతో సరిహద్దు తగాదాలు పరిష్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

డ్రోన్ సర్వేతో రైతుల మధ్య, కుటుంబాల మధ్య సరిహద్దు తగాదాలు పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ దండు అశోక్ వర్మ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పొలమూరు, పెనుమంట్ర, మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో మూడు రోజులపాటు జరిగే డ్రోన్ సర్వేను మొదటిరోజు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌వర్మ మాట్లాడుతూ పొలమూరులో 1950, పెనుమంట్రలో 3763, మల్లిపూడిలో 850, జుత్తిగలో 1880 ఎకరాల్లో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ కుటుంబాల్లో, పంట పొలాల్లో జరిగే సరిహద్దు తగాదాలను ఈ సర్వేతో నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, వైసిపి పెనుమంట్ర గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, వ్యవసాయ మండల కమిటీ మండలి ఛైర్మన్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు రాగిజావ పంపిణీ

ప్రజాశక్తి - అత్తిలి

అత్తిలి బాలికల హైస్కూల్లో ఈనెల 21వ తేదీన విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేయనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదా జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరై విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు.

యోగా పోటీల్లో సారికకు ప్రథమస్థానం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ జి.సారిక ఈ నెల 19వ తేదీన నరసాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. సోమవారం కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఫిజికల్ డైరెక్టర్‌గా యోగాలోనూ అనేక బహుమతులు అందుకున్న సారిక విద్యార్థులను అదే స్థాయిలో తర్ఫీదిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సారిక రాష్ట్ర స్థాయి యోగా అవార్డు సాధించి అందరికి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

'చంద్రబాబును గెలిపించాలి'

ప్రజాశక్తి - ఆచంట

జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న వెతలు తీరాలంటే టిడిపి కార్యకర్తలు చంద్రబాబు నాయుడును గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. సోమవారం ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లో మండల అధ్యక్షులు కేతా మీరయ్య అధ్యక్షతన మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు తెలుగు యువత గ్రామ కమిటీ అధ్యక్షులుగా గెద్దాడ త్రినాథ్, బొక్క బాలాజిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, తెలుగు యువత మండల అధ్యక్షులు కేతా మురళి, పార్లమెంట్ అధికార ప్రతినిధి తమ్మినీడి ప్రసాద్, ఎస్‌సి సెల్ నియోజవర్గ అధ్యక్షులు, బీరా నరసింహమూర్తి గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ అభినందించారు.



పెదఅమిరంలో ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు చేస్తున్న కూలీలు

పెదఅమిరంలో ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో వేసవి దృష్ట్యా రూ.10 లక్షలతో ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్పిడి పనులు చేపట్టి ప్రజలకు సురక్షిత నీరు అందించడానికి కృషి చేస్తున్నామని గ్రామ సర్పంచి దొక్కు సోమేశ్వరరావు తెలిపారు. పెదఅమిరం పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన ఫిల్టర్ బెడ్లలో ఉన్న పాత ఇసుక తీసి కొత్త ఇసుక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధాన రహదారి 20 అడుగులు వెడల్పు ఉండేలా సిమెంట్ రోడ్డు పనులను రూ.40 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త, మట్టి తొలగించే పనులు చేస్తున్నామన్నారు. గ్రామంలో సిమెంట్ డ్రైయినేజీ పనులు కోటి రూపాయలతో చేస్తున్నామన్నారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో పెదఅమిరం గ్రామాభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

ఆలయానికి ఆర్‌ఒ వాటర్‌ప్లాంట్ అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు కుక్కలవారితోటలో ఉన్న చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయానికి దాతలు ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను అందించారు. యాత్రికులకు శుద్ధి జలాలు అందించేందుకు మొగల్తూరుకు చెందిన ప్రవాస భారతీయుడు మధిర వెంకట సుబ్రహ్మణ్యం ఈ వాటర్‌ప్లాంట్‌ను అందించారు. గ్రామ సంఘ అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ సంఘస్తులు ఈ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుక్కల నాగమల్లేశ్వరరావు, కడలి మండులు, పూజారి కడలి ఏడుకొండలు, కుక్కల కుమార్ స్వామి, దొంగ సింహాచలం, లక్ష్మణ్, రాజేష్ పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూలును డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డి.శ్రీరామ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిటిల్ ఛాంప్స్ ఎడ్యుఅకాడమీ వారు జనవరిలో నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 1, 5, 9 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఆ విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించిన మేడపాటి విజయను, ఐదో ర్యాంకు సాధించిన కూచిబత్తుల భరత్ శర్మను, తొమ్మిదో ర్యాంకు సాధించిన గుడిమెట్ల కేదార్‌ఈశ్వర్‌ను, తెలుగు ఒలింపియాడ్‌లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించిన ద్వారంపూడి రూపశ్రీసాయి లక్ష్మితని అభినందించారు.

నేరాలు - ఘోరాలు

ట్యాబ్‌లు చోరీ

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు హైస్కూల్లో పన్నెండు ట్యాబ్‌లు చోరీకి గురయ్యాయని ప్రధానోపాధ్యాయులు కాయల వీరాస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ధర్మారావు తెలిపిన వివరాల ప్రకారం... పాఠశాలలో చోరీతో పాటు నడపనవారిపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయంలో వెండి ఆభరణాలు, హుండీలోని నగదు అపహరించుకుపోయారని తెలిపారు. ఈ చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ దొంగతనాలకు సంబంధించి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ రెండు చోరీలు జరిగిన సంఘటన స్థలాలను సిఐ నాగప్రసాద్, క్లూస్‌టీం పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు.

ఆరుగురిపై కేసు నమోదు

కాళ్ల : కాళ్ల గ్రామంలో ప్రభుత్వ వైన్‌షాపులో పనిచేస్తున్న సేల్స్‌మెన్ ముత్యాల శివరంగారావుపై దాడి చేసిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల ఎస్ఐ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... శివరంగారావు ఆదివారం రాత్రి షాపులో స్టాక్ చేస్తుండగా ఆకివీడుకు చెందిన ఆరుగురు వ్యక్తులు అతిగా మద్యం తాగారు. ఈ క్రమంలో బీర్లు పెట్టుకోవడానికి ఖాళీ బాక్స్ అడిగితే శివరంగారావు లేదని చెప్పడంతో ఆరుగురు కలిసి రంగారావుపై దాడి చేశారు. శివరంగారావు ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మూర్తి తెలిపారు.

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తణుకు మండలం కోనాల గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామీణ కూలీలకు వెన్నుదన్నుగా ఉన్న ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేసి, బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని ఆయన కోరారు. అడిగిన వారందరికీ పని కల్పించి రోజు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. మోడీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అనంతరం ఉపాధి హామీ రక్షణ కోసం మజ్దూర్.కిషన్, సంఘర్ష్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కిరాల హరి, ఆకుమర్తి సుశీల, గెడ్డం మణి, కత్తుల దానమ్మ,గెడ్డం స్వర్ణ, గూడవల్లి నరసింహమూర్తి, కారంకి రాజు పాల్గొన్నారు.

బావులను పరిరక్షించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడ అగ్రహారంలో గ్రామపంచాయతీ నిధులతో ప్రభుత్వ భూముల్లో తవ్వించిన బావులు ఆక్రమణకు గురయ్యాయని, ఆ బావులను స్వాధీన పరచుకోవాలని జాతీయ దళిత నాయకుడు కోరం ముసలయ్య సోమవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. అదే గ్రామంలో రెండో వార్డులో గత సర్పంచి తవ్వించిన బావిని ఆక్రమించుకోవటమే కాకుండా ఆ బావి చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేశారని పెన్నాడ గ్రామానికి చెందిన ముసలయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. గత సర్పంచి ఇట్టా సురేష్ బావిని స్వాధీనపరచుకొని ప్రజల అవసరల నిమిత్తం బావిని బాగు చేయించారని తెలిపారు. అదే బావిని గృహ యజమాని ఆక్రమించుకొని బావి కనిపించకుండా ప్రహరీ గోడను నిర్మించి కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేశారు. సంబంధిత బావిని పరిరక్షించి పంచాయతీ స్వాధీనం చేసుకొని కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఎస్ఆర్‌కెఆర్'లో 25న సూపర్ నోవా సింపోజియం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన సూపర్ నోవా జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ సోమవారం కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ ఎసిఎస్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సుమారు ఏడు విభాగాల్లో వివిధ సాంకేతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి సలహాదారుగా డాక్టర్ ఎన్ఎల్.పవన్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కో-ఆర్డినేటర్స్‌గా చైతన్య, సునీల్, జగదీప్, వెంకట్రావు వ్యవహరిస్తున్నారు. విద్యార్థి ప్రతినిధులుగా అబ్బాస్, అంబేద్కర్, దుర్గాశంకర్, నైషీదా, మహాలక్ష్మి, ఆమని, హరిణి, సూర్య వ్యవహరిస్తున్నారు.

కుటుంబకథ చిత్రాల హీరో శోభన్ బాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాలులో నాటభూషన్ శోభన్‌బాబు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు మాట్లాడుతూ శోభన్‌బాబు అభిమాన సంఘాన్ని భీమవరంలో ఏర్పాటు చేసి ఆ సమితి ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు శోభన్ బాబు గురించి సమితిని పలుమార్లు అభినందించారన్నారు. ఆయన మరణం సినీ ప్రపంచానికి తీరని లోటన్నారు. ఆయన మరణించి 15 ఏళ్లు అయినా శోభన్ బాబు పేరిట సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, ఇక మీద కూడా చేస్తూనే ఉంటామని చెప్పారు.

పక్షి జాతులను రక్షించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మానవాళి మనుగడకు పక్షులు ఎంతగానో దోహదపడుతున్నాయని, అంతరించిపోతున్న పక్షి జాతులను రక్షించేందుకు పర్యావరణ ప్రేమికులందరూ కృషి చేయాలని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాల ప్రాంగణంలోని అరుదైన ఆయుర్వేద వనంలో పిచ్చుకల పరిరక్షణ కోసం పిచ్చుక గూళ్లను వాటికి ఆహారాన్ని అందించేందుకు ఆహార ధాన్యాల గుత్తులు, నీరు చెట్ల మధ్య ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగపతి రాజు మాట్లాడుతూ పక్షి జాతి లేనిదే మానవ మనుగడ సాధ్యం కాదన్నారు. సెల్ సిగ్నల్ వ్యవస్థ ద్వారా పక్షులకు హాని జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌డి డీన్ పిఎ రామకృష్ణంరాజు, ఉన్నత భారత అభియాన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఆర్.సుబ్బారావు, ఎం.గణేష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM FAMILY COURT AT VIJAYAWADA
M.C. No. 100/2019

Between:
1. Talakayala Vijayakumari
2. Talakayala Denyce Darshini Being Minor, Rep. by Mother 1st Petitioner
... Petitioners

AND

Talakayala Rajasekhar S/o Gnana Prasad, C.R.P.S. Constable, R/o. Housing Board Colony, LIG-1-214, Tadepalligudem, West Godavari Dist.
.... Respondent

పై నెంబరు పిటిషన్‌లోని రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీ కోర్టువారు ది.28-03-2023నకు వాయిదా వేసినారు. కావున మీరు పై తేదీన ఉదయం గం.10.30 ని.లకు స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల పై కేసు మీ పై పరోక్షమున తీర్మానింపబడును.

/// BY COURT ORDER ///

Talakayala Vijaya Kumari
Petitioner
VIJAYAWADA
VIJAYAWADA
Dt.20-03-2023

ప్రకటన

In The Court Of The Senior Civil Judge Court : Bhimavaram
O.S.No. 245/2015

Plaintiff:
Dasetti Appalanarasamma
AND
Defendants:
1) Muchi Srinivasa Rao (Died)
2) Muchi Lakshmi, W/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.
3) Muchi Teja, S/o. Late Srinivasa Rao, R/o. Sri Sayana Street, Gunupudi, Bhimavaram, W.G.Dist.

పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తం దావా సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్టు ద్వారాను పంపించినను, వాటిని మీరు అందుకొని యుండుట లేదు. అందువలన మీరు **ది.31-03-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియ పరుచుకొనవలెను.** అట్లు హాజరు కానిచో మీ పరోక్షంలో సదరు దావాను తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

పి.రాజారావు
భీమవరం, వాది తరుపు అడ్వకేట్, భీమవరం.
20-3-23. సెల్: 94401 30111

రంగసాయికి ఉగాది నంది పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈనెల 19వ తేదీన రాజమండ్రిలో జరిగిన ఉగాది నంది పురస్కార వేడుకల్లో భీమవరానికి చెందిన సామాజిక సేవా కర్త చెరుకువాడ రంగసాయి నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడారు. మాతృభాష సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా భాషా సాహిత్య సామాజిక విద్య వైద్య క్రీడా కళా రంగాల్లో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందించారన్నారు. పీపుల్స్ స్టార్, సినీనటులు, దర్శకులు ఆర్ నారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్‌పి భారతి చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు రంగసాయి తెలిపారు. రంగసాయిని భీమవరం పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు నాయకులు పలువురు అభినందించారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ ఉపయోగకరం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఫ్యామిలీ పిజిషియన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పిహెచ్‌సి వైద్యుడు రంగం నాయుడు అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహ, బిపి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రోగులకు హెల్త్ ఎడ్యుకేషన్ నిర్వహించారు. సమయానికి భోజనం చేయాలని, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పి.మాణిక్యవల్లి, ఆరోగ్య సహాయకుడు శ్రీను, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మార్టేరు పిహెచ్‌సి, నెగ్గిపూడి ఉప కేంద్రం పరిధిలో రక్త పరీక్షలు నిర్వహించారు. హెమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం మాధవి, హెల్త్ అసిస్టెంట్ డి.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్ సంధ్య పాల్గొన్నారు.

వంకా రవీంద్ర దంపతులకు సత్కారం

పాలకొల్లు : ఎంఎల్‌సిగా ఎన్నికైన జిల్లా లయన్స్ క్లబ్ అంబాసిడర్ వంకా రవీంద్రనాథ్ దంపతులను పాలకొల్లు లయన్స్ క్లబ్ నేతలు ఘనంగా సత్కరించారు. ఏలూరు లయన్స్ క్లబ్ సారధ్యంలో ఆదివారం రాత్రి పాలకొల్లు లయన్స్ క్లబ్ సీనియర్ నేతలు, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి సారధ్యంలో వంకా రవీంద్ర దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌విఎస్.పాపారావు నాయుడు, కొమ్ముల మురళీకృష్ణ, రేపాక ప్రవీణ్ భాను, కృష్ణ పాల్గొన్నారు.

అక్రమ కౌలు కార్డులను అరికట్టాలి

స్పందనలో రామాంజనేయులు ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కౌలు రైతులకు ఇస్తున్న గుర్తింపు కార్డుల్లో గ్రామ రెవెన్యూ అధికారులు సగానికి పైగా అక్రమంగా భూయజమానులు, వారి బంధువుల పేరున ఇస్తున్నారని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ పి.ప్రశాంతికి దీనిపై సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుల అక్రమాలపై కవిటం, గుమ్ములూరు, పెన్నాడ అగ్రహారం గ్రామాల్లో సర్వే చేసినట్లు తెలిపారు. కవిటంలో 285 కౌలు కార్డులు మంజూరు చేస్తే వాటిలో 198 కార్డులు భూ యజమానులు వారి బంధువుల పేరున ఉన్నాయని తెలిపారు. గుమ్ములూరులో 245 కౌలు కార్డులు ఇస్తే భూ యజమానులు వారి బంధువుల పేరున 50 కౌలు కార్డులు ఇచ్చారని తెలిపారు. ఆయా వివరాలను జిల్లా కలెక్టర్‌కు రామాంజనేయులు అందించారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందించి తక్షణం పరిశీలించాలని జిల్లా అగ్రికల్చర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

గృహ నిర్బంధాలు సరికాదు : సిపిఐ

ప్రజాశక్తి - ఉండి

గృహ నిర్బంధాలు సరికాదని, గత పాలకులు ప్రతిపక్షాలకు విలువనిచ్చేవారని సిపిఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఒకటిని రద్దు చేయాలని సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు నేపథ్యంలో సిపిఐ, సిపిఎం, టిడిపి, ప్రజాసంఘాల నాయకులను గృహ నిర్బంధం చేయడం, ముందస్తు నోటీసులు అందించడం హేయమైన చర్య అన్నారు. ప్రజా ఉద్యమాలను, గృహ నిర్బంధాలు, అరెస్టులతో అడ్డుకోవాలనుకోవడం అవివేకమన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి : వ్యకాస

ప్రజాశక్తి - భీమవరం

దళితులపై మతోన్మాద బిజెపి దాడులను అరికట్టాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు చేయాలని కోరుతూ ఈ నెల 21 జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కమిటీలు సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితుల హక్కులు కాలరాస్తూ, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని నీరు గారుస్తూ దళిత మహిళలు, మైనార్టీలపై దాడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టాలని ఉభయ వ్యవసాయ కార్మిక, డిహెచ్‌పిఎస్, కెవిపిఎస్ అఖిలభారత కమిటీలు సంయుక్తంగా పిలుపునిచ్చాయని తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా సాధించుకున్న హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. దళిత, గిరిజన, మహిళ సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టాలని ఉభయ సంఘాలు నిర్ణయించాయని తెలిపారు. విజయవాడ ధర్నాచౌక లో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, మేధావులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

నైపుణ్య అభివృద్ధికి శిక్షణ అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధిపై సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. యువత ఉపాధి పొందేలా మెరుగైన నైపుణ్యాభివృద్ధి శిక్షణలను ఎంపిక చేసి అందించాలన్నారు. యువత సంబంధిత యాప్‌లో నమోదు చేసుకునేందుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇప్పటికే వివిధ రకాల శిక్షణలను పొందేందుకు 2,194 మంది యువత యాప్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి, మెప్మా పీడీ పార్వతి పాల్గొన్నారు.

డ్రెయినేజీ శుభ్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లిలో డ్రెయినేజీని గ్రామ పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. డ్రెయినేజీ అస్తవ్యస్తంపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు డ్రెయినేజీని శుభ్రం చేయించారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

మొగల్తూరు : మండల కేంద్రమైన మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆరోగ్య శాఖ సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. .

సిపిఐ నాయకుల అరెస్టు దారుణం

ప్రజాశక్తి - పెంటపాడు

సిపిఐ, ప్రజాసంఘాల నాయకుల గృహ నిర్బంధాలు, అరెస్టులు దారుణమని సిపిఐ మండల కార్యదర్శి కలింగ లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కలింగ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ ఒకటిని రద్దు చేయాలని చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు సిపిఐ నాయకులను గృహ నిర్బంధం చేశారన్నారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు బండారు శ్రీను, వంకా అప్పారావు, బి.లక్ష్మీనారాయణ, నున్న బ్రహ్మాజీ, చిన వెంకన్న పాల్గొన్నారు.

తాగునీటి జలాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పాలకోడేరు

రానున్న రోజుల్లో నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మంచినీటి జలాలపై అవగాహన కలిగి నీటిని వినియోగించుకోవాలని సర్ సివి రామన్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శిరీష బాలకృష్ణ అన్నారు. శృంగవృక్షం గ్రామంలోని సర్ సివి రామన్ పాఠశాల విద్యార్థులతో సోమవారం మంచినీటి జలాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ భాస్కర్‌రావు, సాయిబాబా, సుంకర సత్యనారాయణ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వీరవల్లి సత్యం శత జయంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిపిఐ నాయకులు, విశాలాంధ్ర మాజీ విలేకరి వీరవల్లి సత్యనారాయణ (వీరవల్లి సత్యం) శత జయంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు స్థానిక తాడేరు రోడ్డులో ఉన్న భీమవరం ఓల్డేజ్ హోంలో వృద్ధుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, వీరమ్మ పార్క్ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందించారు.

'వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయం'

ప్రజాశక్తి - వీరవాసరం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం టిడిపిదేనని ఆ పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. ఆ పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం చింతలకోటిగరువులో టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస రావు ఇంటి వద్ద నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు యిర్రింకి సాయి బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

పది విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంజీవనగర్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపేందుకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చహాన్ మాట్లాడుతూ ఈ పరీక్షలు భవిష్యత్తుకు నాంది అని, ఒత్తిడిని అధిగమిస్తూ పరీక్షలకు సన్నద్ధమవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు కలీమ్, కార్యదర్శులు సమీర్, సాద్, ఉబేద్ పాల్గొన్నారు.

నిర్మాణాన్ని అడ్డుకోవాలని నిరసన

ప్రజాశక్తి - ఉండి

అనుమతులు లేకుండా గ్రామంలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని చెరుకువాడ గ్రామ ఉపసర్పంచి నడింపల్లి వెంకటరాజు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తహశీల్దార్ రవీంద్రకుమార్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

పాలకొల్లులో జెసిఐ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

జెసిఐ పాలకొల్లు రైజింగ్ వారి ఆధ్వర్యంలో జాతీయ వైస్ ప్రెసిడెంట్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం, జోన్ ఆఫీసర్స్ బోర్డు మీటింగ్ సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాలకొల్లు రైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మౌని కావలి వారి బృందం పాలకొల్లులో పలుచోట్ల రూ.రెండు లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా జెసిఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ మతివణన్, జోన్ ప్రెసిడెంట్ జిఎస్ఎన్.వర్మ పాల్గొన్నారు. నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి దేవాలయం దగ్గర స్వాగతం బోర్డు, జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ స్కూలుకు వాటర్ ప్యూరిఫైర్ పాఠశాల హెచ్ఎం భవాని ప్రసాద్‌కు అందించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు సేద తీరేందుకు ఆరు బెంచీలను స్టేషన్ మేనేజర్‌కు అందించారు. సరస్వతి శిశుమందిర్‌కు రూ.75 వేల ఖరీదైన కంప్యూటర్, యుపిఎస్ పవర్ బ్యాంక్ అందించారు. ఈ సందర్భంగా జాతీయ వైస్ ప్రెసిడెంట్ మతి వణన్ మాట్లాడారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, చొప్పరమెట్ల

టెండరు నోటీసు తేది. 17-03-2023

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, చొప్పరమెట్ల గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు పద్ధతి పై ఈ క్రింది పనులు నిర్వహించుటకు ది. 01-04-2023 నుండి 31-03-2024 వరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఈ టెండర్లు ది.23-03-2023వ తేదీ మధ్యాహ్నం 12:00 గం॥ల పంచాయితీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డ్ టెండర్లు స్వీకరించబడి అదే రోజు మధ్యాహ్నం 12:30 గం॥లకు హాజరైన టెండర్లు దార్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరువబడును. ప్రభుత్వం నిబంధనలకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయం పనిచేయు వేళలయందు పంచాయితీ కార్యదర్శి గారిని అడిగి తెలుసుకోవలెను.

వ.నెం.	పని వివరములు	వ్యక్తులు	కాలపరిమితి	ధరావతు
1	పారిశుధ్యం పనులు నిర్వహణ	03	ది.01-04-2023 నుండి ది.31-03-2024	రూ.500/-
2	మంచినీటి సరఫరా ట్యాంకు ఆపరేటర్	02	ది.01-04-2023 నుండి ది.31-03-2024	రూ.500/-

గమనిక: 1) గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) పంచాయితీ నిధుల నిల్వలను బట్టి పేమెంట్ చేయబడును. 3) టెండర్లు స్వీకరించుటకు తిరస్కరించుటకు పంచాయితీ వారికి అధికారము కలదు.

సం/- **Sk. మీర్జావలి**
పంచాయితీ కార్యదర్శి, చొప్పరమెట్ల
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **కె.ఊర్మిళ**
గ్రామ పంచాయితీ సర్పంచ్, చొప్పరమెట్ల
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, పంగిడిగూడెం

ఫారం నెం.1 తేది. 20-03-2023

టెండరు ప్రకటన

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, పంగిడిగూడెం గ్రామ పంచాయితీ నందు 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది. 01-04-2023 నుండి ది.31-03-2024 వరకు గల కాలమునకు ఈ దిగువ ఉదహరించిన పనులను కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించు నిమిత్తము టెండరులు పిలువడమైనది. టెండరులు ది.29-03-2023 తేదీ మధ్యాహ్నం గం॥ 2 లోగా గ్రామ పంచాయితీ కార్యాలయమునందు పంచాయితీ కార్యదర్శికి స్వయంగా గాని లేదా రిజిష్టరు పోస్టు ద్వారా గాని అందజేసి రూ.100/-లు టెండరు డిపాజిట్ (ఒక్కొక్కరికి) చెల్లించి రశీదు పొందవలెను.

వ.నెం.	పని వివరాలు	పని పేరు	వినియోగించవలసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుధ్య నిర్వహణ, వీధులు శుభ్రపర్చుట, డ్రైన్లు శుభ్రపర్చుట	స్వీపర్	2
2	గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డ్	గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డ్	4+1=5
3	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ (మోటారు స్విచ్ ఆపరేటర్ మరియు పైపులైను రిపేర్లు మరియు ఒ.హెచ్.ఎస్.ఆర్.లు శుభ్రపర్చుట మరియు క్లోరినేషను	ట్యాంక్ ఆపరేటర్	2
4	వీధి విద్యుత్ దీపముల నిర్వహణ	ఎలక్ట్రీషియన్	2

టెండరు ధరఖాస్తు ఫారం మరియు టెండరు దాఖలు చేయుటకు గాను నియమావళి మరియు ఇతర విషయముల కొరకు ఆఫీసు పనిచేయు వేళలలో సంబంధిత పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ, వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.

సం/- **జి.సుబ్బలక్ష్మి,** కార్యదర్శి, గ్రామ పంచాయితీ పంగిడిగూడెం
జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, పంగిడిగూడెం

ఫారం నెం.1 తేది. 20-03-2023

టెండరు ప్రకటన

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, పంగిడిగూడెం గ్రామ పంచాయితీ నందు 2023-2024 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది. 01-04-2023 నుండి ది.31-03-2024 వరకు గల కాలమునకు ఈ దిగువ ఉదహరించిన గ్రామ పంచాయతీకి అవసరమైన పబ్లిక్ హెల్త్ గూడ్స్, ఎలెక్ట్రికల్ స్పేర్ పార్ట్స్ మరియు PWS స్పేర్ పార్ట్స్ సరఫరా చేయుటకు వివిధ ఏజెన్సీల నుండి టెండరులు పిలువడమైనది. టెండరులు ది.29-03-2023 తేదీ మధ్యాహ్నం గం॥ 2 లోగా గ్రామ పంచాయితీ కార్యాలయమునందు పంచాయితీ కార్యదర్శికి స్వయంగా గాని లేదా రిజిష్టరు పోస్టు ద్వారా గాని అందజేసి రూ.100/-లు టెండరు డిపాజిట్ (ఒక్కొక్కరికి) చెల్లించి రశీదు పొందవలెను.

వ.నెం.	సరఫరా చెయ్యవలసిన సరుకు వివరము
1	పబ్లిక్ హెల్త్ గూడ్స్ (ప్రజా ఆరోగ్య మరియు పారిశుధ్య నిర్వహణ నిమిత్తం అవసరమైన బ్లీచింగ్ లైమ్, సోడియం హైపో క్లోరైడ్ Etc) సరఫరా చేయుటకు
2	ఎలెక్ట్రికల్ స్పేర్ పార్ట్స్ (కొత్త లైట్లు మరియు స్పేర్ పార్ట్స్, రక్షిత మంచి నీటి సరఫరా పథకముల నిర్వహణ నిమిత్తం అవసరమైన ఎలెక్ట్రికల్ స్పేర్ పార్ట్స్) సరఫరా చేయుటకు
3	PWS స్పేర్ పార్ట్స్ (రక్షిత మంచినీటి సరఫరా పథకముల నిర్వహణ నిమిత్తం అవసరమైన స్పేర్ పార్ట్స్) సరఫరా చేయుటకు

టెండరు ధరఖాస్తు ఫారం మరియు టెండరు దాఖలు చేయుటకు గాను నియమావళి మరియు ఇతర విషయముల కొరకు ఆఫీసు పనిచేయు వేళలలో సంబంధిత పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ, వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.

సం/- **జి.సుబ్బలక్ష్మి,** కార్యదర్శి, గ్రామ పంచాయితీ పంగిడిగూడెం
జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.